# పాలిష్

"మేడమ్! బ్రాస్ పాలిష్ పౌడరు కావాలా?" అన్న మాటలకు తలెత్తి చూసింది రమ్య.

ఎదురుగా పదహారేళ్ల పిల్ల పంజాబీ డ్రస్ వేసుకొని భుజాన్న చిన్న లెదర్ బాగ్, చేతిలో చిన్న పాకెట్‌తో నిల్చుని వుంది సేల్స్‌గర్ల్.

"ఒద్దు" అంది రమ్య సౌమ్యంగా.

"ఒక్క పాకెట్ తీసుకోండి మేడమ్ ప్లీజ్! పాకెట్ పది రూపాయలే"

"వొద్దన్నానా. మా యింట్లో ఇత్తడి వస్తువులేం లేవు వెళ్లిరా!" అని ఈమారు కటువుగా అంది రమ్య.

"అలా అనకండి మేడమ్! చూడండి ఈ డోర్ బ్రాస్ హేండిల్ ఇంతలా కిలుం పట్టివుందా, దీనికి చిటికెడు పాలిష్ పౌడర్ ఒక్క నిముషం టైమ్ స్పేర్ చేస్తే ఇది మరలా బ్రాండ్ న్యూదానిలా తయారవుతుంది" అని భుజానికి వున్న లెదర్ బాగ్ క్రిందవుంచి చిన్నపాలిష్ క్లాత్ మీద పౌడర్ వేసి నిముషంపాటు డోర్ హేండిల్ని రుద్ది చూపించింది.

సేల్స్‌గర్ల్ చెప్పింది నిజమే. డోర్ హేండిల్ ఇప్పుడు తళతళమెరిసిపోతోంది.

రమ్య సమాధానం చెప్పేలోపల "ఏవిటిటదీ?!" అంటూ ఆమె అత్తగారు అనసూయమ్మగారు వచ్చేరు అక్కడకు.

"నమస్కారమండి! బ్రాస్ పాలిష్ పౌడరండి. ఇత్తడి సామాన్లు క్షణంలో మెరుగుపెట్టొచ్చండి. మీడోరు హేండిల్ చూడండి పాలిష్‌తో ఎలా మెరుస్తందో" అంది సేల్స్ గర్ల్.

అనసూయమ్మగారు ఒక్కక్షణం డోరు హేండిల్‌వేపు చూసి ఇంట్లోకి వెళ్లి దేవుడి తిన్నె ముందున్న రెండు ఇత్తడి దీపం కుందులను చెరొక చేత్తో పట్టుకొని వచ్చేరు. అవి ఒక్కొక్కటే అడుగుఎత్తు, రెండేసి కేజీల బరువు వుంటాయి.

"ఏదీ వీటిని నీ పాలిష్ పౌడరుతో మెరిపించు!" అన్నారు.

సేల్స్‌గర్ల్ వాటిని అందుకొని పౌడరు వేసి పాలిష్ క్లాత్‌తో ఓపిగ్గా రుద్ది వాటికి వున్న కిలుంపోగొట్టి తళతళలాడించి చూపించింది. అనసూయమ్మగారి ముఖం వికసించింది. ఆ దీపపు కుందులు రెండూ ఆవిడ కొత్తగా అత్తవారింటికి వస్తున్నప్పుడు ఆవిడ అమ్మమ్మగారు కొని ఇచ్చినవి. అనసూయమ్మగారు వాటిని ఎంతో అపురూపంగా చూసుకుంటున్నారు.

"పాకెట్ ధర ఎంత?" అని అడిగేరు.

"పదిరూపాయలండి. మూడు పాకెట్లు పాతిక రూపాయలండి!" అంది.

"మూడు పాకెట్లు ఇవ్వు" అన్నారు అనసూయమ్మగారు.

"మూడు పాకెట్లెందుకండీ? ఒకటి చాలు" అంది రమ్య.

"ఎందుకో తరువాత చెప్తాను. ముందు ఈ అమ్మాయికి పాతిక రూపాయలిచ్చి పంపించు" అన్నారు అనసూయమ్మగారు.

"అమ్మగారూ! సిల్వర్ పాలిష్ పౌడరుందండి. వెండి వస్తువులను పాలిష్ చేసుకోవచ్చు....."

"ఏదీ చూపించు" అన్నారు అనసూయమ్మగారు.

సేల్స్‌గర్ల్ బాగ్‌లోంచి సిల్వర్ పాలిష్ పౌడరు పాకెట్ తిసింది.

అనసూయమ్మగారు కోడలు కాళ్లకున్న పట్టీలను, తనకాలి వేళ్లకున్న మట్టెలను ఇచ్చి వాటికి పాలిష్ చేసి చూపించమన్నారు.

సేల్స్ గర్ల్ వాటికి పాలిష్ పౌడరుతో మెరుగుపెట్టి అచ్చంగా కొత్తవాటిలా చేసి ఇచ్చింది.

"సిల్వర్ పాలిష్ పౌడరు పాతిక రూపాయలు అమ్మగారూ" అంది.

అనసూయమ్మగారు అదొక పాకెట్ ఇమ్మనమని మొత్తం ఏభై రూపాయలు సేల్స్‌గర్ల్‌కివ్వమని కోడలికి పురమాయించేరు.

అనసూయమ్మగారికి ఇంటింటికీ తిరిగి వస్తువులను అమ్మే సేల్స్‌గర్ల్స్ మీద ఎంతో సానుభూతి వుంది.

ఆవిడ వాళ్లదగ్గర సోప్స్, డిటర్జెంట్స్, మసాలా పౌడర్సూ, అప్పడాలు, వడియాలు, సేమ్యా పేకెట్సు లాంటివన్నీ కొంటారు.

స్త్రీలు ఇంట్లో లేజీగా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోకుండా సేల్స్‌గర్ల్స్‌గా ఎంతో కొంత సంపాదిస్తూ వాళ్ల కుటుంబానికి సహాయపడుతున్నారంటారు.

ఆవిడకు స్త్రీలు మహిళా మండలి అని క్లబ్బులని తిరగటం, లేదా పనీపాటూ లేకుండా గంటల తరబడి టీవీల ముందు కూర్చోవడం నచ్చదు.

ఆవిడ ఎప్పుడూ చక్రపటాకీల ఇల్లంతా తిరుగుతూ ఏదో పని చేస్తూనే వుంటారు.

రమ్య ఇంట్లోకి వెళ్లి ఏభై రూపాయల నోటు తెచ్చి సేల్స్‌గర్ల్‌కి ఇచ్చింది.

"గోల్డ్ వస్తువులు కూడా పాలిష్ చేసుకోడానికి పౌడర్లేం లేవా నీదగ్గర? అంది రమ్య కాస్త వెటకారంగా.

"లేకేం మేడమ్! ఉంది. గోల్డ్‌పాలిష్ పౌడర్. కాని అది మేం ఎప్పుడూ బంగారం షాపులవాళ్లకు మాత్రమే అమ్ముతాము. దాని ఖరీదు చాలా ఎక్కువ. అందుకని దానిని మా దగ్గర ఎవరూ కొనరు. షాపులవాళ్లు మాత్రమేకొంటారు. పాకెట్ ధర వంద రూపాయలు" అంది.

"ఏదీ చూపించు" అన్నారు అనసూయమ్మ గారు కుతూహలంగా.

రమ్య గతుక్కుమంది. అది కూడ ఆవిడ కొంటుందని.

అనసూయమ్మగారి ఒక్కొక్క చేతికీ నాలుగు జతల బంగారు గాజులు, మెడలోమూడు పేటల చంద్రహారం వున్నాయి. అవి ఆవిడకు కన్నవారిచ్చిన నగలు.

వాటికి మెరుగు పెట్టించాలని ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నారు. "పాలిష్ పౌడర్ కొంటే యింట్లో ఎంచక్కా తనే మెరుగుపెట్టుకోవచ్చు" అనుకున్నారు.

సేల్స్‌గర్ల్ గోల్డ్‌పాలిష్ పౌడరు పేకెట్ బాగ్‌లోంచి బయటకు తీసింది.

అనసూయమ్మగారు తన చేతులకున్న గాజుల్లో రెండు జతల గాజులు తీసి ఇచ్చి "ఏదీ వీటికి మెరుగుపెట్టి చూపించు. మెరుగు బాగుంటేనే పాకెట్ కొంటాను" అన్నారు.

రమ్యకు ఈ తతంగం నచ్చలేదు. ఆ విషయమే అత్తగారికి చెప్పి వారించబోయింది.

అనసూయమ్మగారు కోడలి మాటలనేం లెక్కచేయలేదు. గాజులు పాలిష్ చెయ్యమన్నారు.

సేల్స్‌గర్ల్ కొత్త పాలిష్ క్లాత్ తీసుకొని అందులో కొంచెం గోల్డ్‌పాలిష్ పౌడరు వేసి దానితో గాజులను కాస్సేపు రుద్ది వాటిని ప్లాస్టిక్ డబ్బాలోవున్న నీటిలో కొద్దిసేపు ముంచి వుంచి-

"అమ్మగారూ కొంచెం మంచినీళ్లుకావాలి ఇవి కడగడానికి" అంది.

అనసూయమ్మగారు లోనికి వెళ్లి ప్లాస్టిక్ మగ్గుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చేరు.

సేల్స్‌గర్ల్ గాజులను ఆ నీటితో శుభ్రంగా కడిగి తుడిచి ఇచ్చింది.

గాజులు నిజంగానేకొత్తవాటిలా మెరిసిపోతున్నాయి.

అనసూయమ్మగారు విజయగర్వంతో కోడలివేపు చూసి గాజులు చేతికి వేసుకొన్నారు.

గోల్డ్ పాలిష్ పౌడర్ ఒక పాకెట్ తీసుకొని డబ్బులిచ్చి సేల్స్‌గర్ల్‌ని పంపించేశారు.

రమ్య అత్తగారి చేతులకున్న గాజుల వంక చూసింది.

పాలిష్ పెట్టిన గాజులు మిగిలిన గాజులకన్నా కాస్త సన్నంగాను పల్చగానూ కనిపిస్తున్నాయి. ఆమాటే అత్తగారితో అంది. అనసూయమ్మగారు అనుమానంతో కళ్లజోడు సవరించుకొని చూసేరు.

నిజమే పాలిష్ గాజులు మిగిలిన వాటికన్నా పీలగా కనిపిస్తున్నాయి.

అనసూయమ్మగారి గుండె గుభేలుమంది. వెంటనే వెళ్లి దగ్గరలోవున్న బంగారం షాపులో తూకం వేయించేరు.

ఎనిమిది గ్రాములు తక్కువ వుంది రెండు జతల గాజుల్లో.

అంటే-

రెండు జతల గాజులకు ఎనిమిది గ్రాముల బంగారం పాలిష్ అయిందని నిర్ఘాంతపోయేరు అనసూయమ్మగారు.

(ఆంధ్రభూమి సచిత్రమాసపత్రిక, ఫిబ్రవరి 1997) ✪